సాక్షి బాపట్ల

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



వరసిద్ధి వినాయకుడికి హోమాలు

వినుకొండ: కొండమెట్ల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 40 మంది దంపతులచే నవగ్రహ, లక్ష్మీ, గణపతి హోమాలు చేశారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 31,550 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 17 క్యూసెక్కులు వదులుతున్నారు.

గణపతి హోమం



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : కంచి కామకోటి పీఠం మారుతి దేవాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం గణపతి స్వామికి అభిషేకం, హోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

చంద్ర గ్రహణం సందర్భంగా 7న ఆలయాల మూసివేత



మంగళగిరి: సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం పలు ఆలయాలను మూసివేయనున్నారు. మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఎగువ దిగువ సన్నిధులు, ఘాట్ రోడ్డులోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు అన్ని ఉపాలయాలను మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసివేయనున్నట్లు ఆలయ ఈవో సునీల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గ్రహణ శుద్ధి అనంతరం ఉదయం 8 గంటల నుంచి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని ఆయన పేర్కొన్నారు.

పెదకాకాని శివాలయంలో...



పెదకాకాని: చంద్రగ్రహణం పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆదివారం మధ్యాహ్నం స్వామి వారి మహా నివేదన అనంతరం ఆలయ కవాట బంధనం(తలుపులు మూయుట) జరుగుతుందని డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం రాహు కేతు పూజలు కూడా నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.సోమవారం ఆలయ సంప్రోక్షణ అనంతరం ఉదయం 7:30 గంటల నుంచి భక్తులను అనుమతిస్తామని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోతే సమ్మె



మంగళగిరి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచకపోతే సమ్మెలోకి వెళ్తామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బాయమ్మ తెలిపారు. పట్టణంలోని టిప్పర్ల బజార్‌లో గల సీఐటీయూ కార్యాలయంలో గురువారం రాత్రి మంగళగిరి ప్రాజెక్ట్ మహాసభను కె. హేమలత అధ్యక్షతన నిర్వహించారు. సుబ్బాయమ్మ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీలకు అండగా ఉంటామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వ నాయకులు, అధికారంలోకి వచ్చిన అనంతరం పట్టించుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏ.వి.ఎన్.కుమారి, యు.రుక్మిణి, సుజాత పాల్గొన్నారు.

గోతాల్లో జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలు



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : పేదలందరికీ ఇళ్లు ఉండాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి నిలువ నీడ కల్పించారు. స్థలాలు కేటాయించడంతో పాటు ఇళ్లు నిర్మించే కార్యక్రమం కూడా చేపట్టారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 75 వేల మందికి స్థలాలు కేటాయించారు. ఇందులో కొంత మందికి ఇళ్ల పట్టాలు కూడా పంపిణీ చేశారు.అయితే, వాటిని పూర్తి స్థాయిలో అధికారులు పంపిణీ చేయకపోవడంతో సచివాలయాల్లోనే మూలుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇళ్ల పట్టాల పంపిణీ నిలిచిపోయింది. నగర పరిధిలోని 127వ వార్డు సచివాలయంలో బుధవారం పాత సీఎం జగన్మోహన్‌రెడ్డి పేరుతో సదరం సర్టిఫికెట్ జారీ చేయడంపై కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, సచివాలయ సెక్రటరీలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతో సచివాలయాల్లో ఉన్న పాత సర్టిఫికెట్స్, డాక్యుమెంట్స్‌ను నగరపాలక సంస్థకు అందజేయాలని ఆదేశించడంతో గోతాల్లో వేల సంఖ్యలో రిజిస్టర్ ఇళ్ల పట్టాల డాక్యుమెంట్స్ దర్శనమియ్యాయి. వీటిని ప్రభుత్వం రద్దు చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

కుదేలైన ఇటుక పరిశ్రమ

- మైలవరం ఇటుక రాకతో పడిపోయిన ధరలు
- బట్టీల్లో మూలుగుతున్న కోట్లాది ఇటుకలు
- మూతపడే స్థితిలో బట్టీలు
- ఉపాధి కోల్పోనున్న వేలాది మంది కూలీలు
- గతంలో 250.. ప్రస్తుతం 65 బట్టీలు



తిమ్మాయపాలెంలో పేరుకుపోయిన ఇటుక నిల్వలు

అద్దంకి: రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల్లో నాణ్యతతో గిరాకీ ఉన్న అద్దంకి ఇటుక పరిశ్రమ మూడపడే స్థితికి చేరుకుంది. మైలవరం ఇటుక తక్కువ ధరకే జిల్లాలోని వివిధ ప్రాంతాలకు దిగుమతి అవుతోంది. దీంతో స్థానికంగా తయారయ్యే ఇటుక బట్టీల్లోనే మూలుగుతోంది. గతంలో వెయ్యి ఇటుక రూ.6,500 నుంచి రూ.7వేలు పలుకగా ప్రస్తుతం రూ.5,500 నుంచి రూ.6వేలకు పడిపోయింది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలు లేక పోవడం కూడా ఒక కారణమేనని చెబుతున్నారు. దీంతో ఈ సంవత్సరం పది బట్టీలు మూతపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

నాణ్యమైన ఇటుక

ఇక్కడి ఇటుక నాణ్యతకు పెట్టింది పేరు. ఎంతంటే ఒకప్పుడు నాణ్యతకు పేరుగాంచిన కరవది ఇటుక కన్నా నాణ్యతగా తయారు చేస్తారు. తెల్ల మట్టి, నల్ల మట్టిని కలిపి, అందులో వరిపొట్టు, బూడిద కలిపి పాకం చేసిన ఇటుకలుగా కోస్తారు. ప్రస్తుతం బరువు తగ్గడం కోసం ప్లెయాస్‌ను కూడా వినియోగిస్తున్నారు. దాంతో ఇటుక చాలా గట్టిగా ఉంటుంది.

తక్కువ ధరకే మైలవరం ఇటుక

విజయవాడ సమీపంలోని మైలవరంలో తయారయ్యే ఇటుక తక్కువ ధరకే లభిస్తుండడంతో ఇళ్ల నిర్మాణదారులు అటు వైపు ఆసక్తి చూపుతున్నారు. అక్కడి ఇటుక వెయ్యి బాడుగుతో కలుపుకుని రూ.6 వేలకు లభిస్తోంది. స్థానిక బట్టీల్లో తయారయ్యే ఇటుక ప్రాంతాన్ని బట్టి వెయ్యి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. మైలవరం ఇటుకకు, స్థానిక బట్టీల్లో తయారయ్యే ఇటుక ధరలో భారీ వ్యత్యాసం ఉండడంతో నిర్మాణదారులు మైలవరం ఇటుక వైపు మొగ్గు చూపుతున్నారు.

ఉపాధి కోల్పోనున్న వేలాది మంది కూలీలు

స్థానికంగా తయారయ్యే ఇటుకకు ఆదరణ తగ్గడంతో పరిశ్రమ మూతపడే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయా బట్టీల్లో పనిచేసే వేలాది మంది కూలీలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఉభయగోదావరి, విశాఖపట్నంతో పాటు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది కూలీలు ఇక్కడ ఉపాధి పొందుతున్నారు.

అద్దంకి పరిసరాల్లో వందలాది బట్టీలు..

తిమ్మాయపాలెం గ్రామంలోని ఇటుక మట్టి సంవృద్ధిగా దొరుకుతుండడంతో పదేళ్ల కిందట అద్దంకి, తిమ్మాయపాలెం, రామాయపాలెం, కుంకుపాడు, కలవకూరు ప్రాంతాల్లో 250 బట్టీలు ఉండేవి. అవి రాను రాను తగ్గిపోయి ప్రస్తుతం 65కు పడిపోయింది. దీనికి పోటీ రంగంలో అధిక పెట్టుబడులు తట్టుకోలేక కొందరు మూత వేయగా, ప్రస్తుతం ఇటుక ధర పడిపోవడంతో మరికొంత మంది మూత వేసే పరిస్థితి వచ్చింది.



అద్దంకిలో బట్టీలో నిల్వ ఉన్న ఇటుక

గిట్టుబాటు కావడంలేదు

20 ఏళ్లకు పైనుంచి ఇటుక బట్టీ నడుపుతున్నాను. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా తట్టుకున్నాం. కానీ నేడు ఒక ఇటుక తయారీకి రూ.6.50 పడుతోంది. దీంతో నష్టాలు తప్పడం లేదు. ఈ సంవత్సరం బట్టీ మూత వేద్దామని నిర్ణయించుకున్నా.

–వీరరాఘవులు, బట్టీ యజమాని

బీచ్ ఫెస్టివల్‌కు సహకారం అందించండి

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- ఆక్వా పరిశ్రమల యజమానులు, అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించడానికి సహాయ, సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఆక్వా పరిశ్రమల యాజమానులను కోరారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంకలో నిర్వహించే బీచ్ ఫెస్టివల్‌పై గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆక్వా పరిశ్రమల యజమానులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సూర్యలంక బీచ్‌ను గోవా బీచ్ మాదిరి అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. సూర్యలంకలో ఈనెల 26, 27, 28 తేదీల్లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా 27వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తారని తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్ల సూర్యలంక బీచ్‌ను అభివృద్ధికి ప్రభుత్వం రూ.97 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రూ.50 కోట్ల మేర పనులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు రాయల్ మెరైన్స్ సంస్థ నుంచి, ఆక్వా పరిశ్రమ నుంచి రూ.45 లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఆక్వా పరిశ్రమలు, ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులు బీచ్ ఫెస్టివల్‌కు సహకరించాలని కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, డీపీఓ ప్రభాకర్, మత్స్యశాఖ జేడీ నాయక్, జిల్లా టూరిజం అధికారి నాగిరెడ్డి, బాపట్ల, చీరాల ఆర్డీఓలు గ్లోరియా, చంద్రశేఖర్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఆక్వా పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి కేసులను వేగంగా గుర్తించాలి

క్షయవ్యాధి నివారణ జిల్లా కోఆర్డినేటర్ కార్తీక్‌కుమార్



పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న క్షయవ్యాధి నివారణ అధికారులు

చీరాల రూరల్ : క్షయ వ్యాధి బారినపడిన బాధితుల వివరాలను గుర్తించి గూగుల్ ఫాంలో పొందుపరచాలని క్షయవ్యాధి నివారణ జిల్లా కోఆర్డినేటర్ కార్తీక్‌కుమార్ అన్నారు. ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోషియేషన్ (ఐఎంఏ) హాలులో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎం, నిక్షయ్ మిత్ర, ఆశలకు క్షయవ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక్‌కుమార్ మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నా, రాత్రి సమయంలో చెమటలు పడుతున్నా.. దగ్గితే నోట్లో నుంచి రక్తం పడినా, ఛాతీలో నొప్పిగా ఉన్నా, సక్రమంగా శ్వాస ఆడకపోయినా, బరువు కోల్పోతున్నా, ఆకలిగా లేకపోయినా, అలసటగా ఉన్నా, మెడలో వాపుగా ఉన్నా క్షయవ్యాధి లక్షణాలుగా గుర్తించాలని సూచించారు. ఆయా లక్షణాలు కలిగినవారు ప్రభుత్వ వైద్యశాలలో టీబీ యూనిట్‌లలో ఉచితంగా అందించే మందులను వాడుకోవాలని సూచించారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, షుగర్ వ్యాధిగ్రస్తులు, ధూమపానం, మద్యపానం, పోషకాహార లోపాలున్నవారు, 60 ఏళ్లకు పైబడినవారు కూడా క్షయవ్యాధి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ యూనిట్ సిబ్బంది టి.నరేంద్రబాబు, పీఎస్.వర్ధదార, కె.శ్రీలక్ష్మి, రియాజ్, నీలిమ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'హర్ ఘర్ జల్' పథకం వేగవంతం

ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్



బాపట్ల: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన 'హర్ ఘర్ జల్ జీవన్ మిషన్' పనులను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జీ.గంగాధర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జల జీవన్ మిషన్ పథకం అమలుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి జేసీ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఇంటికీ శుద్ధి తాగునీరు అందించడం ప్రధాన లక్ష్యమని చెప్పారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా, గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడంలో అధికారులు చురుకుగా పనిచేయాలని సూచించారు. అలాగే, పనులను నిర్ణీత గడువులో పూర్తిచేయడం, గ్రామ స్థాయి సమస్యలను తక్షణమే పరిష్కరించడం, ప్రజలతో సమన్వయం సాధించడం ద్వారా పథకం విజయానికి కృషి చేయాలని అన్నారు. అనంతరం, 2028 మార్చి నాటికి ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా అందించడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, డీపీవో ప్రభాకర్, ఐసీడీఎస్ పీడీ రాధా మాధవి, డ్వామా పీడీ విజయలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు మురళీమోహన్ ఎంపిక



గుర్రం మురళీమోహన్

భట్టిప్రోలు: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డును ఈ విద్యా సంవత్సరానికిగాను భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ గుర్రం మురళీమోహన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే వేడుకల్లో ఆయన అవార్డు అందుకుంటారని తెలిపారు. విద్యారంగంలో చేసిన విశిష్ట సేవలకుగాను ఈ అవార్డు అందుకోనున్నారని తెలిపారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయడమే కాక బోధనలో సృజనాత్మకత పద్ధతులను అమలు చేయడం, విద్యార్థుల్లో విలువలు, జాతీయ స్ఫూర్తి, నైతిక విలువలను నాటడం, ప్రతిభావంతులను తీర్చిదిద్దడం వల్లే ఈ గౌరవాన్ని దక్కించుకున్నారని అన్నారు. మురళీమోహన్‌ను హైస్కూల్ ఉపాధ్యాయులు నక్కా వెంకటేశ్వర్లు, శివరామకృష్ణ, ఎస్టేట్ బాబు, కుటుంబరావు, శైలజ, బేబీ, ఆశాలత తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి అవార్డులకు ఇరువురు ఎంపిక



ప్రొఫెసర్ లాల్ అహమ్మద్



ప్రొఫెసర్ కె.జయలలిత

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాలలో జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ లాల్ అహమ్మద్ మహమ్మద్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డుకు ఎంపికయ్యారు. బోధన, పరిశోధన, పరిపాలన విభాగాలలో 19 సంవత్సరాలుగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ లాల్ అహమ్మద్ మహమ్మద్ ఇప్పటి వరకు 19 మంది ఎంఎస్సీ, నలుగురు పీహెచ్‌డీ పరిశోధకులకు అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా సహకరించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ జార్జియాలో వృత్తి శిక్షణను పొందడమే కాకుండా అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాలలో స్టడీ విజిట్ చేసిన ఘనతను పొందారు. స్టూడెంట్ యాక్టివిటీస్ ఇన్‌చార్జిగా, అకడమిక్ మ్యాటర్స్ ఇన్‌చార్జిగా అదనపు వార్డెన్‌గా, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్‌గా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కోచింగ్ సెల్ ఇన్‌చార్జిగా పలు కీలకమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. అనేక జాతీయ సెమినార్లు, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. పలు వ్యవసాయ పత్రికలకు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించడమే కాక 200 పరిశోధన పత్రాలను జాతీయ, అంతర్జాతీయ పత్రికలకు సమర్పించారు. డాక్టర్ లాల్ అహ్మద్‌కు పురస్కారం లభించడం పట్ల అసోసియేట్ డీన్ డాక్టర్ పి ప్రసూనరాణి, బోధన, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

క్రాప్ ఫిజియాలజీ విభాగాధిపతి జయలలిత

బాపట్ల వ్యవసాయ కళాశాలలో క్రాప్ ఫిజియాలజీ డిపార్టుమెంట్ ప్రొఫెసర్, విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ కే.జయలలితను రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలు అవార్డు వరించింది. రెండు దశాబ్దాలపాటు బోధనలోనూ, ఆరున్నర సంవత్సరాలుగా పరిశోధనలోను అత్యుత్తమ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమె జేఆర్ఎఫ్ఎస్ఆర్ఎఫ్–ఐసీఏఆర్ శిక్షణ తరగతులను నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేశారు. జాతీయ సెమినార్లు, వర్క్‌షాపులు, సదస్సులు అనేకం నిర్వహించారు. పదిమంది ఎంఎస్సీ, ఆరుగురు పీహెచ్‌డీ స్కాలర్లకు గైడ్‌గా వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 100 పరిశోధన పత్రాలను వివిధ పత్రికలకు సమర్పించారు. బాలికల హాస్టల్‌కు వార్డెన్‌గాను, అకడమిక్ విభాగానికి ఇన్‌చార్జిగాను వ్యవహరించారు. సాంకేతిక సదస్సులు, ఎగ్జిబిషన్ల నిర్వహణలో పాలుపంచుకున్నారు.

అంతుచిక్కని వ్యాధి.. బతుకులు సమాధి

- భయం గుప్పెట్లో తురకపాలెం
- బయటకు రావాలంటే భయపడుతున్న గ్రామస్తులు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన
- చుట్టాలు కూడా రావడం లేదని ఆవేదనం
- ఇతర గ్రామాల్లో పనులకు వెళ్లాలన్నా రానివ్వడం లేదు
- హడావుడిగా కదిలిన యంత్రాంగం
- వైద్య శిబిరానికి రావాలన్నా భయపడుతున్న ప్రజలు



గ్రామంలో పర్యటిస్తున్న గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా అధ్యక్షులు గోపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సత్తెనపల్లి ఇన్‌చార్జి గజ్జల సుధీర్ భార్గవరెడ్డి


గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామస్తులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు. ప్రతి వీధిలో నలుగురైదుగురు మృత్యువాతకు గురవ్వడంతో చిన్నపాటి అనారోగ్యం కలిగినా భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరిస్తున్నారే గానీ కారణాలు చెప్పడం లేదని ఆందోళన చెందుతున్నారు. తమను పక్క గ్రామాల వారు పనులకు పిలవడం లేదని, జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు

గ్రామంలో అధికారులు మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలు రావాలంటే భయపడుతున్నారు. పరీక్షలు చేసిన తరువాత ఏ రోగం బయటపడుతుందో.. ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నాం కదా! అని కొందరు మిన్నకుండిపోతున్నారు. మరికొందరైతే ప్రభుత్వ వైద్యులను నమ్మలేక ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. చిన్నపాటి అనారోగ్యానికి పెద్ద మొత్తంలో ఖర్చుచేసి చికిత్సలు తీసుకుంటున్నారు. ఇదే అదనుగా చేసుకుని ప్రైవేటు వైద్యులు అందిన కాడికి బిల్లులు కట్టించుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తురకపాలెం అని పేషెంట్ చెబితే చాలు రూ. లక్షల్లో వసూలు చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు.

హడావుడిగా పర్యటనలు

గ్రామంలో మీడియా తిరుగుతుందని తెలిసి అధికారులు హడావుడిగా పర్యటనలు చేశారు. మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వరకూ గడిచిన నాలుగు నెలలుగా ఇంత జరుగుతున్నా పట్టించుకోలేదని, ఇప్పుడు హడావుడి పర్యటనలు చేస్తున్నారంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది హడావుడిగా గ్రామంలోని మురుగు కాల్వలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లుతున్నారు.



ఇంటికి అడ్డంగా తెరలు కట్టుకున్న గ్రామస్తులు

వదంతులతో వణుకు

ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంతో వణికి పోతున్నారు. అదేదో వైరస్.. బ్యాక్టీరియా అంట.. నీటి ద్వారా, మట్టి ద్వారా వస్తుందంట.. అది రావడంతోనే ఇన్‌ఫెక్షన్‌లకు గురై మృత్యువాతకు గురవుతున్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. రాత్రి 8 గంటల తరువాత ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయం కలుగుతుందని వాపోతున్నారు.

ఇంటింటికీ రక్త నమూనాల సేకరణ

జరగాల్సిన నష్టం జరిగిన తర్వాత తీరిగ్గా ప్రజారోగ్యశాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల నుంచి రక్తం, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. తాగునీటి, మట్టి పరీక్షలు చేస్తున్నారు. ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా ? అని పారిశుద్ధ్యం కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

సరిహద్దురాయి సరిచేసిన పెద్దలు

నాలుగు నెలల కిందట గ్రామంలో ఏర్పాటు చేసిన పొలిమేర రాయి ఒక పక్కకు ఒరగడంతో అనర్థాలు జరుగుతున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామంలోని పెద్దలు శాస్త్రోక్తంగా గ్రామ శివారులో ఏర్పాటు చేసిన సరిహద్దు రాయిని సరిచేశారు. ఇప్పటికైనా అకాల మరణాలు ఆగుతాయని గ్రామస్తులు భావిస్తున్నారు.

రచ్చబండ పేరుతో ఎమ్మెల్యే హడావుడి

గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే రచ్చబండ పేరుతో ప్రధాన వీధి చెట్టుకింద కూర్చుని ప్రజలతో ముచ్చటించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని పలువురు అడిగారు. ప్రతి ఇంటికీ రూ. వెయ్యి చొప్పున కలెక్ట్ చేయించండని, దానికి తోడు మరికొంత తాను ఇస్తానని, దాన్ని బాధిత కుటుంబాలకు ఇద్దామని ఎమ్మెల్యే అన్నాడని ప్రజలు వాపోతున్నారు. ఒక పక్క అనారోగాలతో మృత్యువాతకు గురవుతున్న ప్రజలు ఇంటికి వెయ్యి రూపాయలు ఎలా ఇస్తారని మహిళలు, ప్రజలు చర్చించుకుటున్నారు. ప్రజలను ఆదుకోవాల్సిన ప్రజా ప్రతినిధి ఈ విధంగా మాట్లాడటంపై కొందరు పెదవి విరుస్తున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి: ఎమ్మెల్యే బూర్ల

గుంటూరు రూరల్: తురకపాలెంలో స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు గురువారం పర్యటించారు. గత నాలుగు నెలలుగా గ్రామంలో ప్రజలు అకాల అనారోగ్య మృత్యువాతలకు గురవ్వడంతో గురువారం గ్రామంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యశాఖ, తాగునీటి శాఖ అధికారులతో మాట్లాడారు. గ్రామంలో పరిస్థితులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది సరిపోకపోతే ఇతర గ్రామాలనుంచి తెచ్చుకుని పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడి ప్రజల ఆరోగ్య పరిస్థితులను వాకబు చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులును నిలదీస్తున్న గ్రామస్తులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 18,00 గరిష్ఠం : రూ. 2,600

మోడల్ ధర రూ. 2,300

పసుపు ధరలు (గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 647

కొమ్ములు : 551బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,300	10,450	10,320

కాయలు : 241 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,300	10,450	10,350

మొత్తం అమ్మకాలు : 485.25 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం (గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	75,968
అమ్మకాలు	70,144
నిల్వ	15,795

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,300
నంబరు-5	10,000–13,500
341	11,000–13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,500
నంబరు-5	10,000–13,500
341	11,000–15,500
4884	10,000–13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,400
బాడిగ 355	10,000 – 15,000
దేవనూరు డీలక్స్	10,000 – 13600
ఆర్మూర్	9,800 – 12,500
తాలుకాయలు	6,200 – 7,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,300
బాడిగ 355	10,000 – 14,800
దువనూర్ డీలక్స్	10,500 – 13,500
తాలు	5,500 – 7,500

–కొరిటెపాడు (గుంటూరు)

మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తూట్లు

వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షురాలు షేక్ నసీరున్నీసా బేగ్



రేపల్లె: ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షురాలు షేక్ నసీరున్నీసా బేగ్ విమర్శించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ అందజేస్తామని, మైనార్టీలకు ముఖ్య పట్టణాల్లో ఈద్గాలకు, ఖబరిస్తాన్‌లకు స్థలాలు కేటాయింపు చేస్తామని, విజయవాడ సమీపంలో హజ్ హౌస్ నిర్మాణం చేపడతామని ఎన్నికల ముందు ఊకదంపుడు హామీలు ఇచ్చిన కూటమి నాయకులు నేడు హామీల అమలులో చిత్తశుద్ధి చూపడం లేదన్నారు.

- నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా రూ. 100 కోట్లు కేటాయింపు చేసి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందజేస్తామని హామీ ఇచ్చారని, ఇమామ్‌లకు ప్రతి నెల రూ. 10,000 మౌజన్‌లకు రూ. 5000 గౌరవ వేతనం అందిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అర్హత ఉన్న ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమించి మసీదుల నిర్వహణకు ప్రతినెల రూ. 5000 ఆర్థిక సాయం అందిస్తామని కల్లబొల్లి హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. "హజ్ యాత్రకు వెళ్లే ఒక్కో ముస్లింకు రూ.లక్ష సాయం వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలల గడుస్తున్నా ఒక్క హామీని కూడా అమలు చెయ్యకుండా ముస్లిం మైనారిటీలను దగా చేశారన్నారు. ఇప్పటికైనా మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈనెల 8న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే నిరసన కార్యక్రమంలో జిల్లాలోని ముస్లిం మైనార్టీ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జీజీహెచ్ ఏడీగా పూసల శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా (ఏడీ) పూసల శ్రీనివాసరావు గురువారం విధుల్లో చేరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో నేషనల్ హెల్త్ మిషన్ ఏడీగా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు జీజీహెచ్ ఏడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. గుంటూరు జీజీహెచ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా, పరిపాలనా అధికారిగా, ఇన్‌చార్జి ఏడీగా శ్రీనివాసరావు పని చేశారు. 2024లో ఏడీగా పదోన్నతి పొంది, కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం జీజీహెచ్ ఏడీగా పనిచేస్తున్న చింతలపూడి నాగేశ్వరరావు ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. నూతనంగా విధుల్లో చేరిన ఏడీని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ శ్యామ్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జీజీహెచ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నేతలు, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది బొకేలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజీహెచ్‌లో పెండింగ్‌లో ఉన్న రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులను మూడు నెలల్లో ఇస్తామని తెలిపారు. మందులు, సర్జికల్స్, ఇంప్లాంట్ల టెండర్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి, ఆసుపత్రిలో రోగులకు అన్నీ అందుబాటులో ఉండేలా చూస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, జాయింట్ డైరెక్టర్ సుధారాణి సహకారంతో పరిపాలన విభాగంలో మార్పులు తీసుకొచ్చి, మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఏపీ ఎన్జీఓ సంఘ నేతలు, జీజీహెచ్ ఉద్యోగ సంఘాల నేతలు

యడవల్లి దళితులకు న్యాయం చేయాలి

నరసరావుపేట: చిలకలూరిపేట మండలం యడవల్లి దళిత రైతుల నుంచి ప్రభుత్వం కారుచౌకగా తీసుకున్న విలువైన భూములపై హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి న్యాయమైన పరిహారం ఇవ్వాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను కలిసి హైకోర్టు ఉత్తర్వు కాపీలను అందజేసి కోర్టు ఆదేశాల మేరకు యడవల్లి దళిత రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పించాలని కోరారు. రాధాకృష్ణ మాట్లాడుతూ రైతులు కలెక్టర్‌కు పెట్టుకున్న అర్జీపై మూడు వారాలలోగా సమాధానం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. యడవల్లి గ్రామంలో 1975లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నాటి జిల్లా కలెక్టర్ చంద్రయ్య భూమిలేని 120 దళిత, గిరిజన కుటుంబాలకు 416 ఎకరాలు బీడు భూమిని అసైన్డ్ చేసి వీకర్స్ కాలనైజేషన్ సొసైటీ పేరిట రిజిస్టర్‌చేసి పంపిణీ చేశారన్నారు. వాటిని 50 ఏళ్ల నుంచి లిఫ్ట్ ద్వారా ఏడాదికి వరి, ఆరుతడి రెండు పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. భూములలో గ్రానైట్ నిక్షేపాల నెపంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. దళిత రైతులను బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసి ఎకరాకు రూ.8.33లక్షల పరిహారం ఇచ్చి స్వాధీనం చేసుకుందన్నారు. భూమి స్వాధీనం చేసుకునే క్రమంలో 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా బలవంతపు భూ సేకరణ జరిపారన్నారు. అప్పటి 120 మంది లబ్ధిదారులకుగాను ప్రస్తుతం వారి వారసులు 244 మందిగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. నాటి నుంచి నేటివరకు పేద రైతులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో చట్టప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారన్నారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో తమకు న్యాయం చేయాలని హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడంతో దీనిపై వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎకరాకు రూ.40లక్షల పరిహారం ఇవ్వాలని పిటీషనర్ల తరుపు న్యాయవాది వి.రవీందర్ కోర్టులో వాదనలు వినిపించారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి.వెంకటస్వామి, పెద్దిరాజు, యడవల్లి రైతులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన నాయకులు, దళిత రైతులు

విశ్వ కర్మ పురస్కారానికి 'ఏలూరి' ఎంపిక



అద్దంకి: పట్టణానికి చెందిన ఏలూరి వీరబ్రహ్మాచారి విశ్వకర్మ జాతీయ కళారత్న పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీవిరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధునిక జాతీయ సాహిత్య సాంస్కృతిక సంస్థ తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ సంయుక్తాధ్వర్యంలో అవార్డులను ప్రకటించారు. పట్టణానికి చెందిన దారు శిల్పి(చెక్క బొమ్మలు) రంగంలో ప్రతిభ చూపుతున్న ఏలూరి వీరబ్రహ్మాచారిని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ పురస్కారాన్ని ఆయన ఈ నెల 14న తెలంగాణాలోని రాజ్యలక్ష్మి కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అందుకోనున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక



రావిపాటి పోతురాజు



కడలి సుజాత

చినగంజాం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా చినగంజాం మండలానికి చెందిన ఇరువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రావిపాటి శివ వెంకట పోతురాజు, ఆవులదొడ్డి గొల్లపాలెంలోని పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కడలి సుజాతలు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

భిక్షాటనకు వచ్చి నగదు చోరీ

కోడూరు: స్వామిజీల వేషధారణలో భిక్షాటనకు వచ్చిన నలుగురు వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. వారిని కోడూరు పోలీసులు గురువారం చాకచక్యంగా అరెస్టు చేశారు. ఎస్‌ఐ చాణక్య కథనం మేరకు.. మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన బచ్చు వెంకట పున్నయ్య ఇంటికి నలుగురు వ్యక్తులు గురువారం స్వామిజీల వేషధారణ భిక్షాటనకు వచ్చారు. పున్నయ్య వరండాలో టేబుల్‌పై రూ.11 వేలు ఉంచి ఇంట్లోకి వెళ్లాడు. అదే సమయంలో భిక్షాటనకు వచ్చిన నలుగురు దొంగ స్వాములు ఆ రూ.11 వేల నగదును దొంగలించి అక్కడి నుంచి పరారయ్యారు. నగదు పోయిన విషయాన్ని గ్రహించిన పున్నయ్య వెంటనే కోడూరు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా బాపట్ల జిల్లా నగరం గ్రామానికి చెందిన గంధం శివయ్య, గంధం తోట స్వామిజీ, పాసం బాజీ, పాసం యేసును నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

రేపల్లె: రేపల్లె ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియమకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్ర కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్, జంతుశాస్త్రం, కంప్యూటరు సైన్స్ విభాగాల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉన్న వారు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకి హాజరు కావాలన్నారు.

కరెంట్ షాక్‌తో యువ కౌలు రైతు మృతి



భట్టిప్రోలు(వేమూరు): కరెంట్ షాక్ వల్ల యువ కౌలు రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. భట్టిప్రోలు మండలంలోని గుత్తావారి పాలెం గ్రామానికి చెందిన వాకా శరత్(26) గురువారం ఉదయం పొలంలో నీరు పెట్టేందుకు కరెంట్ మోటారు వేశాడు. కొద్దిసేపు తర్వాత ఇనుప గొట్టంపై చెయ్యి పెట్టి మంచినీళ్లు తాగుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కొట్టడంతో పెద్దగా కేక వేసి కింద పడిపోయాడు. పక్క పొలంలో పని చేస్తున్న రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో, వారు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేయగా మృతి చెందాడని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ శివయ్య తెలిపారు.

కుళాయిల ద్వారా మురుగు నీరు సరఫరా

రేపల్లె: రేపల్లె పట్టణంలోని 24వ వార్డు నేతాజీనగర్ వాసులు గురువారం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ పైపుల ద్వారా తాగునీటి బదులు మురుగు నీరు రావడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరఫరా అయిన నీటిలో నుంచి భరించలేని దుర్గంధం వెదజల్లుతుండటంతో తాగడానికి గానీ వాడుకోవడానికి గానీ పనికిరాకపోయిందని కాలనీవాసులు వాపోయారు. రోజుకు ఒకసారి ఇచ్చే నీరు కూడా ఇలా కలుషితమై వస్తే తమ కుటుంబ అవసరాలు ఎలా తీర్చుకోవాలంటూ ప్రజలు ప్రశ్నించారు. కనీసం వాడుకోవడానికి ఒక బిందె కూడా శుభ్రమైన నీరు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ నేతాజీనగర్ సమీపంలోని వాడ మురుగు డ్రైన్‌లో బుధవారం పొక్లెయిన్‌తో పూడికతీత పనులు జరుగుతున్న సమయంలో పైపులు దెబ్బతిన్నాయని, అందువల్లే మురుగు నీరు సరఫరా లైన్లలోకి చేరిందన్నారు. సమస్యను గుర్తించి పైపు లీకేజీని సరిచేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



సరఫరా అవుతున్న మురుగు నీరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో బోల్తా పడిన కారు



ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వరరెడ్డి

మేదరమెట్ల: రోడ్డు దాటుతున్న బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. కొరిశపాడు మండలం పరిధిలోని వెంటాపురం క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఈ ప్రమాదం జరిగింది. పి.గుడిపాడు గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వర రెడ్డి (67) వెంకటాపురం వైపు నుంచి పి.గుడిపాడు వెళ్లేందుకు మోటారు బైకుపై రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో బెంగళూరు నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు.. బైకును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న వెంకటేశ్వరరెడ్డికి తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అదుపు తప్పిన కారు రోడ్డుపై బోల్తాపడింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఉన్న నలుగురికి స్వల్పగాయాలు కాగా ప్రయివేటు వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు. మేదరమెట్ల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసులో ముగ్గురికి ఏడు నెలల జైలు

చుండూరు(వేమూరు): దేవస్థానాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులకు తెనాలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఆకా పవన్ కుమార్ ఏడు నెలలు జైలు శిక్ష విధించారు. వివరాల్లోకి వెళితే.. కారంపూడి విజయ్ కుమార్, తాటిపర్తి సాయి, బండికట్ల పవన్ కళ్యాణ్‌లు 2022, జూన్ 22వ తేదీన చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలోని శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆంజనేయ స్వామి పూజకు సంబంధించిన 20 వెండి వస్తువులు, విజయగణపతి ఆలయంలో పూజకు సంబంధించి 10 వెండి వస్తువులు దొంగతనం చేశారు. ఆలయం ట్రస్ట్ చైర్మన్ పెన్నా వెంకటేశ్వర్లు, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. 2024 ఆగస్టు 17వ తేదీన ఆలపాడు బ్రిడ్జి వద్ద నిందితులను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న వెండి వస్తువులు స్వాధీనం చేసుకొని కోర్టు హాజరు పరిచారు. కేసు విచారణలో భాగంగా తెనాలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారిపై నేరం నిరూపణ కావడంతో ముగ్గురికి ఏడు నెలలు జైలు శిక్ష విధించడం జరిగిందని చుండూరు సీఐ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. కేసును ఏపీపీ పరిశుపోగు సునీల్ కుమార్ ప్రాసిక్యూషన్ చేశారని తెలిపారు.

యూరియా అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు

దాచేపల్లి: యూరియా అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. ఇటీవల కాలంలో యూరియా కొరత అధికంగా ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది వ్యాపారులు ఏపీ నుంచి యూరియా బస్తాలను తెలంగాణకు అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో యూరియా ఇలా తరలిపోకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా బుధవారం రాత్రి పొందుగల, తాంగేడ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టారు. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. యూరియా తెలంగాణకు తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. పూర్తిస్థాయిలో ఏపీలోనే రైతులు వినియోగించాలని కోరారు. అక్రమంగా తెలంగాణకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఏవో వెంకటేష్, ఆర్ఐ శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.



తంగెడ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

జిల్లాలో రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు

పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

నరసరావుపేట రూరల్: జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు చెప్పారు. నరసరావుపేటలోని పలు ఎరువుల దుకాణాలు, జీడీసీ ఎంఎస్ షాపులను గురువారం ఆయన తనిఖీ చేశారు. జగ్గారావు మాట్లాడుతూ రైతులు అనవసరంగా రసాయనిక ఎరువులు, యూరియాను కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దని సూచించారు. అవసరం మేరకే కొనుగోలు చేయాలని తెలిపారు. రసాయనిక ఎరువులు కొన్న రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని తెలిపారు. బిల్లులు ఇవ్వని ఎరువుల డీలర్లపై రసాయనిక ఎరువుల చట్టం 1985 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు అమ్మిన వెంటనే ఈ-పాస్ మిషన్ ద్వారా స్టాక్ అప్డేట్ చేయాలని డీలర్లను ఆదేశించారు. యూరియాను ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి కే.బ్రహ్మయ్య పాల్గొన్నారు.



ఎరువుల గోడౌన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

మత్స్యకారులు నిబంధనలను పాటించాలి

సత్రశాల(రెంటచింతల): సత్రశాల వద్దనున్న కృష్ణానదిలో చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులు కచ్చితంగా నిబంధనలను పాటించాలని జిల్లా అధికారి ఎస్.సంజీవ్‌రావు అన్నారు. గురువారం సత్రశాలలో నాగార్జునసాగర్ (రైట్ బ్యాంక్) సత్రశాల మత్స్యకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ జలాశయానికి ప్రస్తుతం వరద ఉధృతంగా వచ్చి చేరుతుండటంతో చేపల వేటను తాత్కాలికంగా నిషేధించారు. మత్స్యకారులు సత్రశాల ప్రాంతంలో వేట కొనసాగించడంతో స్థానిక మత్స్యకారులు అడ్డుకున్నారు. ఇటీవల వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు దృష్టికి ఈ విషయం వెళ్లడంతో ఆయన అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. జూన్ 30వ తేదీ నాటికి మత్స్యకారులకు ఇచ్చిన అనుమతుల గడువు పూర్తి అయిందని సంజీవ్‌రావు పేర్కొన్నారు. అనుమతి పొందిన ప్రాంతంలోనే ఎవరైనా చేపట వేటకు వెళ్లాలన్నారు. లేదంటే అనుమతులను రద్దుచేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కారంపూడి సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ దొప్పటపూడి మేరికనకం, ఎస్ఐ సీహెచ్ నాగార్జున, మాచర్ల మత్స్యశాకాధికారి శ్రీనివాసరావు, మత్స్యకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంజీవ్‌రావు

పూరిల్లు దగ్ధం

చీరాల అర్బన్: కొత్తపేట పంచాయతీలోని వడ్డె సంఘంలో గురువారం అగ్నిప్రమాదం సంభవించి పూరిల్లు దగ్ధమైంది. గురువారం ఉదయం వంట పనులు ముగించుకుని పొయ్యి ఆర్పకుండా మహిళ పనులకు వెళ్ళడంతో మంటలు వ్యాపించి పూరిల్లు దగ్ధమైంది. ఇరుగుపొరుగు వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. మంటలు పక్కన ఉన్న ఇళ్ళకు వ్యాప్తి చెందక పోవడంతో ప్రమాదం తప్పింది. ఈ లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

అదుపుతప్పిన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి

బల్లికురవ: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో తీవ్ర గాయాలపాలైన డ్రైవర్ చికిత్స అందేలోపు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని వైదన గ్రామ సమీపంలోని పెద్ద చెరువు వద్ద జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. ఎస్ఎల్ గుడిపాడు కాలనీకి చెందిన అంబ్రా దయానందం, రమాదేవి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా.. ఇరువురూ ట్రాక్టర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. రెండో కుమారుడు రామకృష్ణ(22) వైదన చెరువులో నుంచి ట్రాక్టర్ ట్రక్కుకు మట్టి లోడ్ చేసుకుని బయటకు వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రగాయాల పాలైన క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం నరసరావు పేట వైద్యశాలకు తరలించారు. వైద్యం అందేలోపే చనిపోయాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చీరాల అర్బన్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చీరాల హారిస్‌పేటలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చీరాల హారిస్‌పేటకు చెందిన కోటేశ్వరరావు (30) భార్య ప్రియాంకతో కలిసి చెరుకుపల్లిలో నివాసం ఉంటున్నాడు. అయితే పదిరోజులు క్రితం చీరాల హారిస్‌పేటకు చేరుకున్నాడు. ఈ క్రమంలో గురువారం అనుమానాస్పదస్థితిలో ఇంట్లోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగభూషణం తెలిపారు.

ఉరి వేసుకుని బలవన్మరణం

చీరాల అర్బన్: రామాపురంలోని ఓ రిసార్ట్‌లో పనిచేస్తున్న వ్యక్తి గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈపూరుపాలెం ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరికి చెందిన అవ్వారు నరేష్ (42) రామాపురంలోని ఓ రిసార్ట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అయితే గురువారం గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

యద్దనపూడిలో పట్టపగలే చోరీ

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడి పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఓ ఇంట్లో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన గల ఓ ఇంట్లో 70 సంవత్సరాలు వయస్సు గల వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. గురువారం ఉదయం పొగాకు గ్రేడింగ్ పనులకు వెళ్లిన వృద్ధురాలు మధ్యాహ్నం భోజనం నిమిత్తం ఇంటికి రాగా ఇంటి తలుపులతో పాటు బీరువా తలుపులు సైతం తెరిచి ఉండటంతో గమనించి స్థానికులను అప్రమత్తం చేసింది. దీంతో బీరువాను పరిశీలించగా సూమారు 10 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. అలాగే బీరువా కింది బాగంలో వేరే అరలో ఉంచిన రూ.3 లక్షలకు పైగా నగదు అలాగే ఉండటంతో ఊపిరి పీల్చుకుంది. ఈ విషయమై ఎస్సై రత్నకుమారిని విలేకర్లు సంప్రదించగా చోరీ విషయం పరిశీలిస్తున్నామని.. ఇంత వరకు తమకు ఫిర్యాదు అందలేదన్నారు. చోరీ జరిగిన తీరును బట్టి వృద్ధురాలు బంధువులు గానీ సమీపంలోని వ్యక్తులు కానీ చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.